వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 290
శుక్రవారం | 31 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# ఘనంగా అనఘాష్టమి వ్రతాలు

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

8 లో..



8లో..

## చెస్ ఆడుదాం.. చురుకుగా ఉందాం

మంత్రి కొండా సురేఖ



8లో

## విత్తనాల కొరత లేదు

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్
- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య
- విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



8 లో..

## అంధకారంలో మరిపెడ

- సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తం
- వారం రోజులుగా మసక చీకటిలో పట్టణం
- మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం



వివరాలు 2లో..

# ఎవరి ఇష్టం వారిదే

నో పర్మిషన్.. నో సెట్ బ్యాక్




- మానుకోటలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- నిబంధనలు పాటించని గృహ యజమానులు
- ఫిర్యాదు చేసినా స్పందించని మునిసిపల్ అధికారులు

మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండానే కొత్త కొత్త భవంతులు పుట్టుకొస్తున్నాయి. నూతన జిల్లాగా మహబూబాబాద్ ఆవిర్భవించిన తర్వాత పట్టణంలో నూతన భవన నిర్మాణాలు లెక్కకుమించి సాగుతున్నాయి. అయితే నో పర్మిషన్.. నో సెట్ బ్యాక్.. ఎవరి ఇష్టం వారిదే అన్నట్లుగా కొత్త భవనాల నిర్మాణం సాగడం ఆందోళనకు గురి చేస్తోంది. గృహ యజమానులు ఎక్కడకూడా నిబంధనలు పాటించడంలేదన్న విమర్శలున్నాయి. ఫిర్యాదు చేసినా మునిసిపల్ అధికారులు స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మాముళ్లు ఇచ్చుకో.. ఇష్టమొచ్చినట్లు కట్టుకో అన్నట్లుగా టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన రహదారులు సైతం కుంచించుకు పోతున్నాయని, దీంతో ఆయా ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకొని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, మహబూబాబాద్

# ఎవరి ఇష్టం వారిదే







**నో పర్మిషన్.. నో సెట్ బ్యాక్**

**మానుకోటలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు**

**నిబంధనలు పాటించని గృహ యజమానులు**

**ఫిర్యాదు చేసినా స్పందించని మునిసిపల్ అధికారులు**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మానుకోట పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నో పర్మిషన్..నో సెట్ బ్యాక్ అన్నట్లుగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎవరి ఇష్టం వారిదే అన్నట్లుగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారన్న విమర్శలున్నాయి. పలువురు ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేస్తున్నా..తూతూ మంత్రంగా అనుమతులు తీసుకొని ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నా అడ్డుకునేవారు కరువయ్యారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

## నో సెట్ బ్యాక్..

ప్రభుత్వ నిబంధనమేరకు నూతనంగా నిర్మాణాలు చేపట్టేవారు కొంత సెట్ బ్యాక్ తీసుకొని నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే మహబూబాబాద్ పట్టణంలో మాత్రం ఇది మచ్చుకైనా కానరావడం లేదు. రోడ్డును ఆనుకొనే నిర్మాణాలు చేపడుతున్న స్పందించేవారే కరువయ్యారు. పట్టణంలో నూతన భవనాలను రోడ్డు మధ్య నుంచి కనీసం 25 అడుగుల ఆవల ఇంటి నిర్మాణం చేపట్టాలని గత పాలక వర్గం చేసిన తీర్మాణాన్ని మునిసిపాలిటీలో అమలు చేసే అధికారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిబంధనలకు విరుద్దంగా రోడ్డు నుంచి ఆరు నుంచి ఏడు అడుగుల పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడం అధికారుల పనితనానికి నిదర్శంగా నిలుస్తోంది.

## నోటీసులిచ్చినా ఆగని నిర్మాణాలు..




జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇటీవల అడ్డగోలుగా ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ఈదుల పూసపల్లి రోడ్డు వెళ్లే ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే ఇంటి నిర్మాణం చేపడుతున్నప్పటికి మునిసిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇంటికి మునిసిపాలిటీ రికార్డులో ఆన్‌లైన్‌లో గాని ఆ స్థలాలకు సంబంధించిన ఎలాంటి ఆధారం లేకపోవడంతో గత కొన్ని నెలల క్రితం అధికారులు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకూడదంటూ రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా గత కొద్ది రోజుల నుండి యథేచ్ఛగా ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి.

## రాజకీయ అండతో..

అక్రమ నిర్మాణాలపై స్పందించాల్సిన మునిసిపల్ అధికారులు నిర్మాణం జరుగుతున్నా ప్రేక్షకపాత్ర పోషించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరూ లేని సమయం, తెల్లవారుజామున ఇంటి నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో కొంతమంది ఇంటి నిర్మాణం చేస్తున్నట్లు సమాచారం. ఇటు రాజకీయ నాయకుల ఒత్తిడి అటు అనుమతులు ఇవ్వలేని పరిస్థితుల్లో మునిసిపల్ అధికారులు చేతులెత్తేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి




**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, క్రైం :** పదవీవిరమణ అనంతరం పోలీస్ అధికారులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి శుక్రవారం పదవీవిరమణ పొందిన అధికారులను సీపీ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా వచ్చేశారు. పదవీవిరమణ చేస్తున్న ఇన్స్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్సై మునిరూల్లా, ఏఎస్సైలు సమ్మిలాల్, శ్యామ్ సుందర్, సమ్మయ్య, హెడ్ కానిస్టేబుల్ యాకుబ్ రెడ్డిలను సీపీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుడుతూ నేటి తరం పోలీసులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ముఖ్యంగా పోలీసులు తమ విధుల్లో రాణించేందుకు ప్రధాన కారణం వారి కుటుంబ సభ్యుల సహాయ, సహకారాలే కారణం అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం వ్యాయామం, యోగ సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతరయ్య, ఆర్.ఐలు శ్రీధర్, స్వర్జన్‌రాజ్, చంద్రశేఖర్, ఆర్ఎస్ ఐ శ్రవణ్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్‌తో పాటు పదవీవిరమణ పోందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులను సన్మానిస్తాం..

**పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులను సన్మానిస్తామని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. హనుమకొండ నయీంనగర్‌లోని బంకెట్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశంలో నాయిని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఉద్యమకారులను సన్మానించనున్నట్లు తెలిపారు. జూన్ 3 న హంటర్ రోడ్ లోని డి-కన్వెన్షన్ హాల్ లో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసి ఉద్యమకారులను గుర్తించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎవరినీ నిర్లక్ష్యం చేయకుండా కమిటీ సభ్యులు ఉద్యమకారులను గుర్తిస్తుందన్నారు. పొరపాటున మిస్సయిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎన్రోల్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా జూన్ 2 నుంచి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాకతీయ ఉత్సాలు నిర్వహించామని గుర్తు చేశారు. వరంగల్ సెంట్రల్ జైలును కూలగొట్టి వేరే చోటికి తరలించినప్పుడు ఎవరు మాట్లాడలేదని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ జోన్ తీసేసి భద్రాద్రిలో కలుపుతుంటే, ఆర్టీసీ టైర్ రి ట్రేడింగ్ సంస్థ తరలించినప్పుడు మాట్లాడని మీరు రాజముద్రపై రాజకీయం చేస్తూ మలి దశ ఉద్యమం ప్రారంభిస్తామని కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, అబుబాకర్, పుల్లూరి సుధాకర్, బోడా దిన్న, రహీమున్నిసా బేగం, నారాయణ రెడ్డి, దారం జనార్ధన్, జై సింగ్ రాథోడ్, సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి , మంద వీరస్వామి, చెల్లా రాజేంద్ర ప్రసాద్,. గోపాల్ రెడ్డి రిటైర్డ్ ఎన్జీఓ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జాగ్రత్తతో నేరాలను అదుపు చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు అవగాహన పెంచుకొని జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ సబ్-ఇన్ స్పెక్టర్ అఫ్ పోలీస్ కంచి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని ఏకశిలా పార్క్ లో దాదాపు 100 మందికి సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఈవ్ టీజింగ్ పై అవగాహన పెంచుకోవాలరు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930కి ఫిర్యాదు చేయాలని, తెలియని నెంబర్స్ నుంచి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కి ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామని తెలిపారు. మహిళలుకు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏకశిల పార్క్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ సోమయ్య, గవర్నర్ వెంకటేశ్వర్ రావు, కోటేశ్వర్ రావు, కమలాకర్ విజయకుమార్, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్స్ సూర్యనారాయణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌కు ఎస్పీ నివాళి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బత్తిని మనోహర్, హెచ్ సీ-318 శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుడి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణించిన వ్యక్తి చివరి కార్యానికి పోలీస్ వెల్ఫేర్ తరపున ఫ్యూనరల్ చార్జెస్ కింద రూ. 20 వేలు వారి కుటుంబ సభ్యులకు అందించారు.

## డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రౌతు రమేష్



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా హసన్ పర్తికి చెందిన రౌతు రమేష్ నాల్గవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాదు లో గురువారం డీబీఎఫ్ నాల్గవ మహసభ జరిగింది. ఈ మహసభలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లాకు చెందిన రౌతు రమేష్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాల్గవ సారి ఎన్నిక కాగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా బొర్ర సంపూర్ణ, మేకల అనిత, భిక్షపతి, కొమ్ముల కర్ణాకర్, సురేష్, విజయలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రౌతు రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నాల్గవ సారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కొరివి వినయ్ కుమార్, పి.శంకర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 3 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బడి బాట కార్యక్రమంలో డీబీఎఫ్ భాగస్వామ్యం అవుతుందన్నారు. నెల రోజుల పాటు డీబీఎఫ్ విద్యా చైతన్య ఉద్యమాన్ని చెపడుతామని తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చెపట్టాలని మహసభలో తీర్మానించామని రమేష్ తెలిపారు.

# జనంపైకి కాలకూట విషం

### విష వాయువులతో ఉక్కిరిబిక్కిరి
### దగ్గు, తుమ్ములతో ప్రజల అవస్థలు
### విద్యా హెర్బ్స్ ఫ్యాక్టరీని మూసివేయాలని ధర్నా



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కాలకుట విషాన్ని జనం పైకి చిమ్ముతున్నారు. విద్యాహెర్బ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ద్వారా విషవాయువుల వ్యాప్తితో కారం ఘాటు ధూళితో మరిపెడ ప్రాంత గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని కారం మిల్లు నుంచి వ్యాపించిన కారం ఘాటు గాలులతో పిల్లలు, వృద్ధులు, మధ్య వయసుల వారితో పాటు పాడి పశువులు ఇబ్బందులు పడుతున్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని నెలకొల్పిన విద్యా హెర్బ్స్ కారం మిల్లు ఫ్యాక్టరీ వద్ద నుంచి గురువారం రాత్రి ఆకస్మికంగా వ్యాపించిన విషపు గాలుల వల్ల గ్రామంలో ఒక్కసారిగా ఆకస్మిక దగ్గు, తుమ్ములతో జనం ఉక్కిరిబిక్కిరితో అవస్థలు పడ్డారు. అసలే వేసవిలో ఉక్కపోతతో దీనికి తోడు ఘాటుగా వ్యాపిస్తున్న గాలులతో జనం పడ్డ అవస్థలు అన్నీ ఇన్ని కావు. ఫ్యాక్టరీలో సదరు కార్మికులు జరిగిన టెక్నికల్ తప్పుల వల్ల విషపు గాలులు ఒక్కసారిగా మరిపెడను చుట్టుముట్టినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో పాటు ఫ్యాక్టరీలోని వ్యర్థపు నీటిని కూడా నల్ల చెరువులోకి వదలడంతో ఒక్కసారిగా ఘాటు వ్యాపించి ఉండవచ్చని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పెద్దలు రాజకీయాలకతీతంగా సదరు కారం మిల్లుపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ఫ్యాక్టరిని మూసివేయాలని ధర్నా..**

మరిపెడ పట్టణ కేంద్ర శివారులో నిర్మించిన విద్యా హెర్బ్స్ ఫ్యాక్టరని మూసివేయాలని మరిపెడ గ్రామ ప్రజలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత కొద్దిరోజులుగా హెర్బల్ ఫ్యాక్టరీ నుంచి విష రసాయనాలు వ్యాపించి ప్రజలు శ్వాశ కోశ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నల్ల చెరువులోకి వ్యర్థ పదార్థాలు వదిలి కాలుష్యానికి కారణమవుతున్న విద్యా హెర్బ్స్ ఫ్యాక్టరీని మూసివేయాలని మరిపెడ గ్రామస్థులు ఆ ఫ్యాక్టరీ ముందు ధర్నా నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. పాక్షికంగా ఫ్యాక్టరీకి తాళం వేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో గ్రామ ప్రజలు దేవరశెట్టి లక్ష్మీ నారాయణ, అజీజ్, అప్సర్, పరుశరాములు, మీరా హుస్సేన్, ఉపెందర్ రెడ్డితో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు.





## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ మున్సిపల్ కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కొందరు గృహ యజమానులు అనుమతులు తీసుకున్న దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, పరకాల మున్సిపల్ పరిధిలో గ్రౌండ్ ఫ్లోర్ కు అనుమతులు లేకుండా గ్రౌండ్ ఫ్లోర్, జీ త్రీ ప్లస్ ఫోర్ అంతస్తులు నిర్మించడం, రోడ్లపై సెట్ బ్యాక్ కాకుండానే వాటి మెట్లు రోడ్లమీదనే నిర్మాణం చేయడం, వాహనాలకు ప్రజల రాకపోలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులే మామూళ్ల మత్తుకు అలవాటు పడి ఇలాంటి నిర్మాణాలకు అవకాశం ఇస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు అక్రమ భవన నిర్మాణాలకు నోటీసులు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. తప్ప వాటి మీద చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ప్రశాంత్ హెచ్చరించారు.

## వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా చేస్తా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగలీల మైదానం వాకర్స్ కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లను చదును చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగింపచేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. వాకర్సు నడిచే దారిలో రోడ్లు అంతా ఎగుడు దిగుడుగా ఉండడం వలన ముళ్ళ కంపలు అడ్డుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం కార్పొరేటర్ మరుపల్ల రవికి విన్నవించినందున శుక్రవారం కార్పొరేటర్ మరుపల్లరవి వాకర్స్ తో కలిసి నడిచి వారు పడుతున్న బాధను గమనించారు. మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జేసీబీ ద్వారా పనులు చేపడుతామన్నారు. వాకర్స్ కు ఉపయోగపడేలా శాశ్వత పరిష్కారానికి అధికారులకు తెలియపరుస్తానని హామీ ఇచ్చారు. మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ను వారం రోజుల లోపు ఎత్తివేస్తామని వరంగల్ మహానగరపాలక సంస్థ సీఎంహెచ్ఓ రాజేష్ తెలియపరిచినందున వాకర్స్, ప్రజలు మహానగర పాలక సంస్థకు సహకరించాలని మరుపల్ల రవి కోరారు. రంగ లీలా మైదానం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మల అంబేద్కర్, జిల్లా నాయకులు కస్తూరి రాజు, ఉపాధ్యక్షుడు గుడిమెళ్ల మోహన్, కడారి కుమార్, వంగర కోటి, రవి యాదవ్, రమేష్, బాబు, శ్రీపతి కుమార్, గుర్రపు కిరణ్, నరిగె లక్ష్మణ్, కోదాటి శ్రీధర్, రడం శ్రీనివాసులు ఉన్నారు.

# రాజముద్రలో కాకతీయ కళాతోరణాన్ని తొలగించొద్దు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ రాజులు పరిపాలించిన ఓరుగల్లు సామ్రాజ్యంలో రామప్ప దేవాలయం గానీ, వేయి స్తంభాల గుడి గానీ, ఇది భద్రకాళి అమ్మవారు గానీ, ఖిల వరంగల్ లో ఎన్నో చెప్పుకోదగ్గ విశేషాలు ఉన్నాయి. కాకతీయ రాజుల పాలనలో చారిత్రక కాకతీయ కళాతోరణాన్ని రాజముద్రలో తీసివేయడం చాలా బాధాకరమని తెలుగుదేశం పార్టీ నాయకులు చిలువేరు రవీందర్ అన్నారు. ఓరుగల్లు ప్రజలను అవమానపరిచే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండడం సరైనది కాదని, మన ఓరుగల్లు ఎంతో ప్రసిద్ధిగాంచిన పర్యాటక క్షేత్రంగా పేరుగాంచిన ఓరుగల్లు కళాతోరణం ఇప్పుడు నూతనంగా ఏర్పాటు చేస్తున్న రాజముద్రలో తీసివేయడం క్షమించలేని నిర్ణయమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజముద్రలో అమరవీరుల స్థూపం పెట్టడం చాలా మంచి విషయమే కానీ, దాంతో పాటు ఓరుగల్లు కళాతోరణాన్ని కూడా రాజముద్రలో ఉంచాలని డిమాండ్ చేశారు. ఓరుగల్లు ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా రాజముద్ర ఉండకూడదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓరుగల్లు ప్రజల పక్షాన, తెలుగుదేశం పార్టీ పక్షాన ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఠాకూర్ గణేష్ సింగ్, కాంద్రాతి శ్రీకాంత్, బజ్జూరి వీరేశం, కంద్రాతి రాజు, కాంద్రాతి రవి పాల్గొన్నారు.



# కాకతీయ చరిత్రను చెరిపితే సహించం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అధికార చిహ్నాం నుంచి కాకతీయ కళా తోరణాన్ని తొలిగించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ సర్కిల్ వేదికగా శాంతియుత నిరసన కార్యక్రమం , మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, భారత రాష్ట్ర సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నాం నుంచి కాకతీయ కళా తోరణాన్ని తొలగించే నిర్ణయాన్ని వాయిదా వేస్తే కాదని, విరమించేదాకా ఊరుకోబోమని అన్నారు. కాకతీయ చరిత్రను చెరపబోతే సహించబోమని హెచ్చరించారు. కాకతీయ కళాతోరణం రాచరికానికి గుర్తు అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అజ్ఞానానికి చింతిస్తున్నామని అన్నారు. కాకతీయ కళాతోరణం రాచరికానికి కాదు రాజసానికి, సుపరిపాలనకు గుర్తు అని తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై పోరాడుతుంటే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కేసులకు ఆదరం అరెస్టులకు బెదరమని, పోరాట మార్గం విడుమని స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ నిర్ణయంగా భావించడం లేదని, తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకోని వ్యక్తి.. చరిత్రపై అవగాహన లేని వ్యక్తి.. తెలంగాణ, ఓరుగల్లు చరిత్రను చెరిపివేయాలని చూస్తున్నాడు. ఆ దుశ్చర్య తప్పు అని చెప్పే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. తెలంగాణ చరిత్రను రూపు మాపాలని చేస్తున్న కుట్రలను తిప్పి కొడతామని హెచ్చరించారు. చరిత్ర గుర్తులను తొలగిస్తుంటే వరంగల్ జిల్లా మంత్రులు వ్యతిరేకించపోవడం సిగ్గు చేటు, కొండా సురేఖ, సీతక్క స్పందించాలి కోరారు. కాకతీయులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలు చేశారు. ప్రజా వ్యతిరేక పనులు చేయలేదని, తెలంగాణ ఓరుగల్లు చరిత్ర తెలుసుకోవాలని కోరారు. టెంపుల్స్, ట్యాంక్స్, టౌన్స్ విధానంతో కాకతీయులు జన రంజక పాలన అందించారు. కాకతీయ కళతోరణాన్ని తొలగిస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తాని, కాళోజీ ధిక్కార స్వరాన్ని చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి తన అనాలోచిత నిర్ణయంపై పునరాలోచించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, రంజిత్ రావు, సంకు నర్సింగ్, ఇమ్మడి రాజు లోహిత, రాజు నాయక్, పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, జనార్దన్ గౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు గంద్రకోట రాకేష్ యాదవ్, పబ్బోజు శ్రీకాంత్ చారి, టార్చ్ సంస్థ ప్రతినిధులు అరవింద్ ఆర్య, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తుల వాడకంతో క్యాన్సర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పొగాకు ఉత్పత్తుల వాడకం వలన క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం "వరల్డ్ నో టుబాకో డే" సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పొగ త్రాగటం ఒక ఫ్యాషన్ గా భావిస్తూ వ్యసన పరులై జీవితాలను అంధకారం మయం చేసుకుంటున్నారని పొగాకు ఉత్పత్తులతో పాటు నగరంలో కొన్ని చోట్ల నిసిద్ధ మాదకద్రవ్యాల బారిన పడుతున్నట్లు ఈ మధ్య వెలుగు చూసిన సంఘటనలు తల్లిదండ్రులను కలవర పెడుతున్నాయని అన్నారు. పొగ తాగే వారి పక్క ఉన్నవారిపై అది మరింత ప్రభావం చూపెడుతుందని అనేక పరిశోధనలు వెలుగు చూసిందని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా వారి ఆశయాలతో పాటు తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని తెలిపారు, విద్యా సంస్థలలో కూడా కూడా ఉపాధ్యాయులు విద్యార్థులను ఒక కంట కనిపెడుతూ తగిన సలహాలు సూచనలు ఇచ్చి వారిని సన్మార్గంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు."డోంట్ మేక్ ఆన్ యాష్ ఆఫ్ యువర్ సెల్ఫ్" అన్న నినాదంతో విషయ పరిజ్ఞానం ఉన్న సైకాలజిస్టులతో నగరంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థలలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించే దిశగా సమాలోచనలు జరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అలాగే ఎన్ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు అయ్యే విధంగా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ దాదాపుగా విద్య హక్కు చట్టం వచ్చి 15 సంవత్సరాలు గడుస్తున్నా, అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకపోవడం వలన ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల, పేద విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలో చదువుకునే దుస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించే విధంగా చూడాలన్నారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేకున్నా ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేసి యజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాదవత్ భాస్కర్ నాయక్, మోహన్, రాజ్ కుమార్, అంజి నాయక్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్వేరోస్ నాయకుల్లారా ఖబర్దార్

### కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మైస సురేష్ కుమార్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఒళ్లు, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ కుమార్ మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుని విమర్శించే స్థాయి స్వేరోస్ నాయకులకు లేదన్నారు. స్వేరోస్ పేరుతో రాజకీయాలు చేయడం కాకుండా బహుజన నినాదంతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజనులను మోసం చేసి, బహుజనుల ఆత్మ గౌరవాన్ని దొరల దగ్గర తాకట్టు పెట్టారని ఆరోపించారు. కేఆర్ నాగరాజు ఎంతోమంది పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల చదువుల కోసం ఎంతో కృషి చేస్తూ, కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ఉద్యోగాలు పొందేలా నిరుద్యోగులకు అండగా ఉంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐత ప్రవీణ్ కుమార్, బెజ్జం పాపారావు, ఐత యాకాంతం, సిలువేరు శ్రీధర్ యాదవ్, ఐత సుధాకర్, మహ్మద్ సోహెల్, కొండేటి సుధాకర్, రామగిరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నగర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా సుల్తానా సమ్మక్క



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సుల్తానా సమ్మక్కను సిటీ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆమె తీసుకున్నారు. ఈ సందర్భంగా సుల్తానా సమ్మక్క మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన 19వ డివిజన్ కాంగ్రెస్ నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## కల్తీ విత్తనాలను అరికట్టాలి

### కలెక్టరేట్ ముందు న్యూ డెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ధర్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో ఈ వర్షాకాల సీజన్లో అక్రమ దందాగా కొనసాగుతున్న కల్తీ విత్తనాలను అరికట్టాలని, నకిలీ క్రిమిసంహారక మందులు, ఎరువులు అమ్ముతున్న వ్యాపారులపై చర్య తీసుకోవాలని శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్ ) నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. జిల్లాలో వరంగల్ నగరంతో పాటు నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాలతో పాటు మండల కేంద్రాల్లో మేజర్ పంచాయతీ గ్రామాల్లో నకిలీ విత్తనాల దందా కొనసాగుతున్నదన్నారు. పెద్ద కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలు పాకెట్ల ద్వారా సరఫరా జరుగుతుందని, రూ.750 ఉండే ఒక పత్తి విత్తనాల పాకెట్ ను రూ. 2000 వరకు బ్లాక్ లో అమ్ముతున్నారని వారన్నారు. గత సంవత్సరం వరంగల్ లో కూడా కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారని, ఈ సంవత్సరం కూడా నకిలీ విత్తనాల వ్యాపారం చేసే వారిని గుర్తించి వారిపై చర్య తీసుకోవాలని వారి లైసెన్స్ కూడా రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ను వారు కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టే బాధ్యత రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానిదేనని, అన్ని రకాల విత్తనాలను రైతులకు 70 శాతం సబ్సిడీ కింద అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తమ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి ఆగస్టు 15లోపు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం రైతాంగాన్ని మోసగించడమేనని వారు అన్నారు. ఇప్పటికే బ్యాంకుల నుంచి లక్ష రూపాయల అప్పు అసలు కాగా, వడ్డీ రూ.40 వేల నుంచి 50 వేల వరకు పెరుగుతుందని, పాత రుణాలు ఏమో గానీ, బ్యాంకులు కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. దీనివల్ల రైతులు మరింత అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వెంటనే రుణమాఫీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు .రైతుల పండించిన పంటకు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్ )రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క, పీవైఎల్ జిల్లా నాయకులు గంద్రతి హరిబాబు, వీరన్న, భద్రాజి, వాగ్య, మహమూద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామ్ సుందర్ ఉద్యోగ విరమణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ పి.శ్యామ్ సుందర్ శుక్రవారం ఉద్యోగ విరమణచేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్యామ్ సుందర్ ను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్ లో ట్రాఫిక్ ఎస్ఐ పి.శ్యామ్ సుందర్ సుదీర్ఘంగా 40 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని, కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు పదవోన్నతి పొంది, ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారని అన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ ను తన విధి నిర్వహణలో ఎదురైయిన అనుభవాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. "రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కానీ, తన వ్యక్తిత్వానికి కాదు"అని కొనియాడారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా,పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారు. పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అత్యవసరం అయినప్పుడు రిటైర్డ్ పోలీస్ అధికారుల సేవలు వినియోగించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

# కళాతోరణం తొలగింపు బాధాకారం

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయ కళా తోరణాన్ని తొలగించడం చాలా బాధాకరమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇప్పటికే మన చరిత్ర మరుగున పడుతుందనే దానిని, ఇంకా కనుమరుగు చేయాలనుకోవడం సరికాదన్నారు. కాకతీయులు అనుసరించిన పాలన విధానం గొలుసుకట్టు చెరువులు, ప్రతి గ్రామంలో దేవాలయాలు నిర్మించడం, వారు గ్రామాలలో అభివృద్ధి చేసి వ్యవసాయ విధానం పైన వారు అందించిన సుపరిపాలన ఆదర్శనీయమని తెలిపారు. ప్రపంచ దేశాలు తమ చరిత్రని వెలికితీయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుంటే మనం మాత్రం ఉన్న చరిత్రని కనపడకుండా చేస్తున్నామన్నారు. మన కాకతీయ చరిత్ర గురించి ఇతర రాష్ట్రాలు , ఇతర దేశాలు గొప్పగా చెప్పుకుంటుంటే మనం మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటలీ యాత్రికుడు అయిన మార్కోపోలో మన కాకతీయ పాలన గురించి తన గ్రంథంలో పొందుపరిచిన చరిత్ర మనది. అలాంటి చరిత్రని కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేయడం చాలా బాధాకరమన్నారు. ఇది ఓరుగల్లు ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా లోగో మార్పు చేయడం తెలంగాణ ఉద్యమనేతగా ఖండిస్తున్నానని తెలిపారు. ఈ విధమైన ఆత్మగౌరవమైన అనైతిక చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తున్నానని పేర్కొన్నారు.

## రేపు వెంకటేశ్వర్లపల్లికి ఎమ్మెల్యే జీఎస్సార్ రాక



**వరంగల్ వాయిస్, కొత్తపల్లిగోరి/ రేగొండ :** రేపు సాయంత్రం 7:00 గంటలకు కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రానున్నారు. గ్రామంలో వరుసగా ఐదు రోజుల పాటు చిరుతల రామాయణ భక్త మండలి వారి ఆధ్వర్యంలో జరిగే శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ చిరుతల రామాయణం నాటిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి, టెంకాయ కొట్టి ప్రారంభించనున్నట్లు చిరుతల రామాయణ భక్త మండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ మొదటి రోజున సీతారాముల కళ్యాణం, రెండో రోజున సీతారాముల వారి అరణ్యవాసం, మూడవ రోజున వాలి వధ, నాలుగవ రోజున లంకా దహనం, ఐదో రోజున రావణ వధ కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఈ నాటిక ప్రదర్శనకు ఉమ్మడి రేగొండ మండలంలోని అన్ని గ్రామాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారని వారు తెలిపారు.

## సిటీ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పల్లకొండ రాజమణి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరానికి చెందిన పల్లకొండ రాజమణిని వరంగల్ నగర మహిళా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి నియామక లెటర్ ను తీసుకున్నారు. ఈ సందర్భంగా పల్లకొండ రాజమణి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## అత్యవసరమైతేనే బయటికి వెళ్లండి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఎండల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అత్యవసరం అయితేనే బయటికి వెళ్లాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ మండల ప్రజలకు సూచించారు. వచ్చే 4 రోజులు ఉష్ణోగ్రతలు సుమారు 49-55 డిగ్రీలకు చేరుకుంటుందని వాతావరణ శాఖ తెలిపిందని కాబట్టి, దెబ్బకు గురి కాకుండా ఇంట్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు. ఉదయం 11 గంటల లోపు పనులు ముగించి ఇండ్లకు చేరుకోవాలని, సాయంత్రం 4 గంటల తరువాత బయటకు రావాలని మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ విజ్ఞప్తి చేశారు.


# వడ దెబ్బకు గురై వ్యక్తి మృతి

## ఏకలవ్య సంఘం బాధ్యుల నివాళి

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వడ దెబ్బకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పల్లకొండ ఐలయ్య వడ దెబ్బకు గురై గురువారం రాత్రి మరణించాడు. విషయాన్ని తెలుసుకున్న ఏకలవ్య సంఘం బాధ్యులు ఆయన స్వగృహానికి చేరుకొని ఐలయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఐలయ్య మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పులిశెరు జంపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లకొండ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురి శ్రీను, పులిశెరు సమ్మయ్య, పులిశెరు రాజేందర్, పులిశెరు వెంకటేష్, కుమారస్వామి, పల్లకొండ సారయ్య, పల్లకొండ మల్లయ్య, సదయ్య పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో సరిపడా విత్తనాలు

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ములుగు జిల్లా కేంద్రం లోని లక్ష్మీ ఎరువులు పురుగు మందులు, విత్తనాల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని విత్తనాలను స్వయంగా కలెక్టర్ పరిశీలించి, విత్తనాలకు సంబంధించిన కంపెనీ వివరాలను , ఎమ్మార్పీ ధరలను, కంపెనీ నుంచి విత్తనాలను దిగుమతి చేసుకున్న రశీదులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ నేరుగా రైతులకు ఫోన్ ద్వారా సంభాషించి విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించారా లేదా అధిక ధరలకు విక్రయించారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వానాకాలం 2024 పంటకు జిల్లాలో అవసరమైన మేర విత్తనాలు అందుబాటులో స్టాక్ పెట్టుకున్నామని, రైతులకు సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. అదేవిధంగా మన జిల్లాలో విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడా కొరత రాకుండా అప్రమత్తంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడ నకిలీ విత్తనాలు విక్రయం కాకుండా గట్టిగా నిఘా ఏర్పాటు చేశామని, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ అధికారులు పోలీస్ అధికారులతో కలిపి టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోళ్లు చేయవద్దని, ఆయా కంపెనీ లేబుల్ కలిగిన ప్యాకెట్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోళ్లు చేసిన డీలర్ నుంచి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయే వరకు భద్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర, ములుగు ఏడీ శ్రీపాల్, ఏఓ సంతోష్, తదితరులు ఉన్నారు.

# ధూమపానం ఆరోగ్యానికి హానికరం




**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** పొగాకు ఉత్పత్తులతో తయారు చేయబడిన ధూమపానం వల్ల ఆరోగ్యానికి హానికరమని శ్రీనివాస ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రామక శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హసన్ పర్తి పీహెచ్ సీలో నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎన్ సీడీ కాన్ఫరెన్స్ హాల్ లో డీఎంహెచ్ఓ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రామక శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు వలన హృదయ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం, 30ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దల మరణాలకు ఎక్కువగా పొగాకు ఉత్పత్తులే కారణంగా ఉన్నాయన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం 1987లో ప్రారంభించారని, పొగాకు ఉత్పత్తుల వాడకం మూలంగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని, ధమపానం ఆరోగ్యానికి హానికరమని, పొగాకు ఉత్పత్తులను వాడి ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయడం వలన పర్యావరణానికి ముప్పు అని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ, పోలీసులు, వ్యవసాయ శాఖ వారు అవగాహన కార్యక్రమంతో పాటు పొగాకు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్ బాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ అహ్మద్, డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ అనిల్ రెడ్డి, అశోక్ రెడ్డి, రామచందర్, నరేష్, కందుకూరి సంతోష్ కుమార్, ఇంద్రారెడ్డి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలన్నింటికీ త్వరలోనే పరిష్కారం



## టీఎన్జీవోస్ నేత మారం జగదీశ్వర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ ఉపాధ్యక్షుడు పల్లోరి మల్లేశం జూనియర్ అసిస్టెంట్ కాకతీయ మెడికల్ కాలేజ్ ఉద్యోగ విరమణ సన్మాన సభ టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో శు క్రవారం కేఎంసీలోని ఎన్నారై భవన్ లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ మల్లేశం 44 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ ప్రయాణంలో ఎన్నో అనుభవాలను చూశారని, వారి ఉద్యోగ జీవితం మిగతా ఉద్యోగులకు ఆదర్శవంతంగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలన్నీ ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నాయని, ఎన్నికల కోడ్ అనంతరం ముఖ్యమంత్రిని కలిసి మరొకసారి మన సమస్యలపై విన్నవిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యలన్నీ ఎన్నికల కోడ్ అనంతరం తప్పనిసరిగా పరిష్కరిస్తారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ మల్లేశం తన 44 ఏళ్ల సర్వీస్ లో దాదాపు 38 ఏళ్లు కాకతీయ మెడికల్ కాలేజీలోనే క్రమశిక్షణతో పనిచేశారని, ఎన్నో అవార్డులు అందుకున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్ మాట్లాడుతూ పల్లోరీ మల్లేశం ఉద్యోగ నిర్వహణలో చక్కగా, క్రమశిక్షణతో పనిచేశారని వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమావేశం అనంతరం కాకతీయ మెడికల్ కళాశాల సిబ్బంది, టీఎన్జీవో నాయకులు మల్లేశంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ఏడీ యాదగిరి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్ కిషన్, కార్యదర్శి వేణు గోపాల్, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, మోయిన్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సదానందం, సలీం రాజమౌళి, రాజేష్ ఖన్నా, సురేష్, రాంప్రసాద్, కలకోట్ల భరత్, అనూప్, రాజీవ్, మెహబూబ్, పైడి రాజు, ప్రణయ్, నవీన్, శివ, రియాజ్, సురేందర్ పాల్గొన్నారు.

# కౌంటింగ్ సరళిపై సిబ్బందికి అవగాహన అవసరం

## ఏఆర్ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కౌంటింగ్ సరళిపై సిబ్బందికి అవగాహన అవసరమని ఏఆర్ఓ/ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో కౌంటింగ్ విధానంపై కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏఆర్ఓ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ఓ మాట్లాడుతూ 15-వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధి లోని 106-వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సరళి గురించి ఎన్ కొర్ టీం టాబ్యులేషన్ తో పాటు స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను టేబుళ్ల వారీగా 14 టేబుళ్ల పైకి ఏ విధంగా చేరుకోవాలనే అంశాలు, కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ తరగతులలో భాగం గా వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధికి సంబంధించి 230 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 16 రౌండ్ లలో కౌంటింగ్ నిర్వహించడానికి 14 రౌండ్లలో మొదటి రౌండులో పోలింగ్ కేంద్రం నెంబర్ 1కు రెండవ పోలింగ్ కేంద్రం 2 నకు పద్ధతిలో ఒక్కో రౌండ్ కు 14 టేబుళ్లలో కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని, కౌంటింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఏఆర్ఓ తెలియజేశారు. కంట్రోల్ యూనిట్ (సీయూ)పై ఉన్న పింక్ పేపర్ సీల్, గ్రీన్ పేపర్ సీల్, అడ్రస్ ట్యాగ్ ను 17(సి)లను సరిచూసుకొని కౌంటింగ్ ఏజెంట్లకు చూపించిన తర్వాతనే కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ లో ఏదైనా సమస్య ఏర్పడి పక్కకు ఉంచిన సీయూలను,అనగా మొత్తం ఓట్లు సరి పోల్చబడక పోతే పోలింగ్ అనంతరం క్లోజ్ బటన్ ను నొక్కక పోయి ఉన్న వాటిని పక్కకు ఉంచాలని తెలిపారు. అలాగే ర్యాండమ్ గా ఎంపిక చేసిన 5 వీవీ ప్యాట్లను ఎంపిక చేసే విధానాన్ని ఏఆర్ఓ సిబ్బందికి వివరించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలాంటి మొబైల్ ఫోన్ల కు అనుమతి లేదన్నారు. ఒకవేళ తీసుకువస్తే మొబైల్ ఫోన్లను కౌంటింగ్ కేంద్రం బయట ఉన్న మొబైల్ స్టోరేజ్ కేంద్రంలో భద్రపరచుకొని కౌంటింగ్ రహస్యతను కాపాడాలని సూచించారు. కౌంటింగ్ విధానంలో నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సెక్షన్-128 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, ఎన్నికల డీటీ సుభాన్, మాస్టర్ ట్రైనీలు సందీప్ కుమార్, నాగరాజు, నాగేశ్వరరావు, ఐటి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలను అతని వీరాభిమాని మండల కేంద్రానికి చెందిన గొడిశాల స్వామి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి భిక్షపతి, ఇల్ల సూరయ్య, కందుల స్వామి, వనపర్తి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

## గూగులోతు రవీందర్ నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకులు ఒళ్ళు, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ గుగులోతు రవీందర్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండలో రవీందర్ నాయక్ మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుని విమర్శించే స్థాయి స్వేరోస్ నాయకులకు లేదన్నారు. నాగరాజు ఎంతోమంది పేద కుటుంబాల పిల్లల చదువులకు ఎంతో కృషి చేస్తూ, కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ఉద్యోగాలు పొందేలా నిరుద్యోగులకు అండగా ఉంటున్నారని తెలిపారు.

# ఘనంగా జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ జన్మదిన వేడుకలు

## అతిథి అనాథాశ్రమంలో పండ్ల పంపిణీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జగిత్యాల డీఎస్పీ దూరిశెట్టి రఘు చందర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐలాపురం వేణు చారి, ఉపాధ్యక్షుడు పెద్దోజు వెంకట చారి ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డి కాలనీలోని అతిథి అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దోజు షణ్ముఖ చారి, రామకృష్ణ, వేణు వర్ధన్, తరుణ్ కుమార్, జర్నలిస్ట్ లు సలెంద్ర రవీంద్ర చారి, సర్వేశ్వర చారి, సిద్దోజు రాకేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# దాసరి త్రిమోతికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన దాసరి త్రిమోతి కాకతీయ యూనివర్సిటీ డిపార్ట్ మెంట్ ఆఫ్ మైక్రో బయాలజీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. దాసరి త్రిమోతి సూపర్ వైజర్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో "స్క్రీనింగ్ అండ్ ఫంగల్ స్ట్రెయిన్స్, లాకేసెస్ లక్షణం పారిశ్రామిక వ్యర్థాల బయోరిమెడియేషన్" అనే అంశంపై సమర్పించిన పరిశోధన థీసిస్కు గాను కాకతీయ యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రకటించింది. దాసరి త్రిమోతి ప్రస్తుతం కాకతీయ మెడికల్ కాలేజిలో వీఆర్డీఎల్ ల్యాబ్ లో సైంటిస్ట్ గా ఉద్యోగం చేస్తున్నారు. తన మేనత్త కీ.శే దాసరి సారక్క సహకారంతో ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ సాధించడం సంతోషంగా ఉందని, ఈ డాక్టరేట్ ఆమెకే అంకితం చేస్తున్నట్లు తెలిపారు. దాసరి త్రిమోతి డాక్టరేట్ పట్టా సాధించడం పట్ల గ్రామ ప్రజలు, కుటుంబసభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

# దళితులను గుడిలోకి అనుమతించకపోవడం హేయం

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దళితులను చంపితే చట్టపరంగా ఉరి తియ్యాలని ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో పెరుమాండ్ల మాట్లాడుతూ కులం పేరుతో గుడిలొకి రానివ్వకుండా అడ్డుకోవడం, కులాల పేరుతో రౌడీయిజం చేయడం మంచిది కాదన్నారు. సిద్దిపేట రూలర్ మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో హనుమాన్ మాల ధరించిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మిట్టపల్లి కృష్ణతో పాటు ఐదుగురు వ్యక్తులు అదే గ్రామం హనుమాన్ గుడిలోకి పూజ చేసుకోవడానికి వెళ్లగా కొందరు వ్యక్తులు కులాల పేరు తీస్తూ వారిని అడ్డుకోవడం, గుడిలోకి రానివ్వకుండా గేటు మూసివేయడం సరైన పద్ధతి కాదన్నారు. సంగారెడ్డి జిల్లాలో కోహిర్ మండలం బడంపేటలో దోపిడీ కులస్థుల చేతిలో హత్య చేయబడ్డ బేగిరి నరసింహులు తను చేసిన పాపం ఏంటని ప్రశించారు. ఇతర కులానికి చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు చంపేస్తారా అన్నారు. కులాలు, మతాల పేరుతో కొందరు వ్యక్తులు అల్లర్లు సృష్టిస్తూ మానవ మనుగడకు ముప్పులా మారారని మండిపడ్డారు. దేవాలయాల్లోకి రానివ్వకపోవడం, కులాంతర వివాహాలు చేసుకుంటే హత్యలు చేయడం అగ్రకులం అనే పేరుతో రౌడీయిజం చేసే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పెరుమాండ్ల డిమాండ్ చేశారు. మరొక్కసారి వేరే వాళ్ళు ఇలాంటి తప్పులు చేస్తే ఉరి శిక్ష, యావజ్జీవ జైలు శిక్ష విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్ గౌడ్, ప్రేమ్ కుమార్, రాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తుల వాడకంతో క్యాన్సర్

## డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి బాయి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సిగరెట్లు, బీడీలు, చుట్టల రూపంలో పొగతాగడం.. పొగాకు ఉత్పత్తులను తినడం ఇప్పుడు చాలా మందికి అలవాటుగా మారిందనీ వీటి వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ హెచ్చరిస్తున్నా కూడా ఈ అలవాటు నుంచి బయటపడటం లేదని, పొగాకును ఏ రూపంలో తీసుకున్నా అది ఆరోగ్యానికి హానికరమని, ఇది శరీరంలోని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి పేర్కొన్నారు. ఐడీఓసీలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి మాట్లాడారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రతి సంవత్సరం మే 31న 'యాంటీ టొబాకో డే (పొగాకు వ్యతిరేక దినోత్సవం)'ను నిర్వహిస్తోంది. దీన్ని 'ప్రపంచ నో టొబాకో డే' గానూ పిలుస్తారని, పొగాకు వాడకం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రమాదాలను మే-31న వివిధ కార్యక్రమాల రూపంలో వివరించడం జరుగుతుందని, వరల్డ్ నో టొబాకో డే నిర్వహించాలని 1987 ఏప్రిల్ 7వ తేదీన తీర్మానాన్ని డబ్ల్యూహెచ్ఓ ఆమోదించిందని 1988 మే 31 నుంచి ప్రతి సంవత్సరం 'పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం థీమ్ "పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించడం". అని తెలిపారు. క్యాన్సర్ కేసుల్లో 85 శాతం పొగతాగడం వల్ల వచ్చినవే అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్లు మహేందర్ రెడ్డి, కేవీ రాజు, గీత సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, ఆఫీసు సూపరింటెండెంట్ రవికుమార్, ఫహీముద్దీన్, లింగారెడ్డి, టీబీ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ శ్వేత, అశోక్, ఎన్హెచ్ఎం డీపీఓ రుక్కుద్దీన్, డీడీడిఎం సౌమిత్, డీఏఓ వసంత రాజకుమార్, సావిత్రి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.




## కాల్‌షీట్ల కోసం ఎదురుచూపు

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్‌టు బ్యాక్ సినిమాలు లైన్‌లో పెట్టాడని తెలిసిందే. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న సినిమాల్లో ఒకటి హరిహర వీరమల్లు . పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. అప్‌డేట్ ఇస్తాడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. వారి కోసం నెట్టింట ఇంట్రెస్టింగ్ న్యూస్ హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం ఈ మూవీ షూటింగ్‌ను జూన్ 15 నుంచి షురూ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ షూటింగ్ మొదలైన వారం తర్వాత చిత్రీకరణలో పాల్గొనబోతున్నాడని సమాచారం. ఈ సినిమాను సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన హరిహరవీరమల్లు పోస్టర్లు, గ్లింప్స్ వీడియోలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచుతున్నాయి. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా..కొన్ని రోజుల క్రితం హరిహరవీరమల్లు అండ్ టీంపై వచ్చే హై ఆక్టేన్ యాక్షన్ సీన్లను ఇప్పటికే రామోజీఫిలింసిటీలో చిత్రీకరించారు. పవన్ కల్యాణ్ మరోవైపు ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో కూడా నటిస్తున్నాడు.

## తండ్రిని తలచుకుంటూ..
## మహేశ్ ఎమోషనల్ పోస్ట్


తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన నటుడు కృష్ణ. అర్ధ శతాబ్దం పాటు తన సత్తా చాటిన ఈ లెజెండరీ నటుడి జయంతి నేడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు, అభిమానులు ఆయన్ని గుర్తుచేసుకుంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఇక తన తండ్రిని తలచుకుంటూ మహేశ్ బాబు ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న. మిమ్మల్ని ప్రతి క్షణం మిస్ అవుతున్నాను. నా ప్రతి జ్ఞాపకంలోనూ మీరు ఎప్పటికీ జీవించే ఉంటారు' అంటూ కృష్ణ యంగ్ లుక్‌లో ఉన్నప్పటి ఫొటోను మహేశ్‌బాబు పంచుకున్నారు. హీరో సుధీర్ బాబు కూడా కృష్ణను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే మామయ్య. మీ పక్కన కూర్చొని 'హరోం హర' చూడాలనుంది. నేను ఇలాంటి యాక్షన్ సినిమాలో నటించాలని మీరు ఎప్పుడూ ప్రోత్సహించేవారు. ఈ సినిమా మీకోసమే చేశాను. మీరు గర్వపడేలా చేస్తానని హామీ ఇస్తున్నాను' అని రాసుకొచ్చారు.

అశోక్ గల్లా కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. ఈ సినిమాలోని రెండో పాటను కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. 'జై బోలో కృష్ణ' అంటూ సాగే ఈ పాటను ఆయనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

## తమిళంలో బిజీగా కీర్తి సురేశ్



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా సినీ ప్రేమికులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నేను శైలజతో తెలుగు ఇండస్ట్రీలోకికి ఎంట్రీ ఇచ్చి అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇక గత ఏడాది దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగు సినిమాలకు బ్రేక్ ఇచ్చేసి వరుసగా తమిళంతో పాటు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే హిందీ నటుడు వరుణ్ ధావన్‌తో ఒక సినిమా చేస్తున్న ఈ భామ తాజాగా 'రఘు తాతా' అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమాకు సుమన్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి రీసెంట్‌గా టీజర్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే అదే రోజు తెలుగులో అల్లు అర్జున్ పుష్ప విడుదల కానుంది. దీంతో ఆగష్ట్ 15న రెండు పెద్ద సినిమాలు పోటి పడనున్నట్లు తెలుస్తుంది. ఇక రఘు తాతా టీజర్ చూస్తే.. నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో క్యాడెట్ శిక్షణ పొందుతున్న కీర్తి సురేష్ పాత్రతో టీజర్ ప్రారంభమవుతుంది. అయితే ఔఅఅ మాస్టర్ హిందీలో శిక్షణ ఇస్తుండగా.. నాకు హిందీ రాదు తమిళంలో చెప్పండి సార్ అంటూ కీర్తి సురేష్ చెబుతుంది. దీంతో ఈ చిత్రం తమిళ ప్రజలపై హిందీని రుద్దడం చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. ఒక సన్నివేశంలో హిందీ పరీక్ష రాస్తేనే ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుంది అంటే దానిని కీర్తి సురేష్ తిరస్కరించడం చూడవచ్చు. 'సలార్'తో సక్సెస్ అందుకున్న హోంబలే ఫిల్మ్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. ఎంఎస్ భాస్కర్, రవీంద్ర విజయ్, దేవదర్శిని, రాజీవ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. షాన్ రోల్డన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.




## అదికూడా త్వరలోనే నేర్చుకుంటా.

రక్షిత్ శెట్టి హీరోగా నటించిన సప్త సరాగాలు దాటి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ చైత్ర జే అచర్. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ తాజాగా షేర్ చేసిన ఫొటోలు నెట్టింట సెగలు రేపుతున్నాయి. స్విమ్ షూట్‌లో స్విమ్మింగ్ పూల్‌లో దిగిన ఈ భామ నీటిలో తడిసిముద్దయింది. కాటుక కండ్లతో మత్తెక్కించే హావభావాలతో హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. కానీ అప్పటివరకు ఇలా మెస్మరైజింగ్ పోజులతో మేనేజ్ చేస్తానంటూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చింది. ఈ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

# అంధకారంలో మరిపెడ

**సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తం**

**వారం రోజులుగా మసక చీకటిలో పట్టణం**

**మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం**



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ పట్టణ ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పనిచేయడం లేదు. పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. గత వారం రోజులుగా మరిపెడ మున్సిపాలిటీ పట్టణంలోని సగ భాగం అంధకారంతో, మసక చీకటిలో మగ్గుతోంది. మరిపెడ పట్టణం వరంగల్, ఖమ్మం హైవేతో పాటు 365 హైవేపై ఉంది. ప్రధానంగా పట్టణ కేంద్రంలోని మహబూబాబాద్ క్రాస్ రోడ్డు నుంచి సాయిబాబా గుడి వరకు వీధిలైట్లను సెంట్రల్ లైటింగ్ కు అనుసంధానం చేశారు. ఈ లైట్లు ఏర్పాటు చేసినపటినుంచి వివిధ ప్రమాదాలతో పలు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మరికొన్ని స్తంభాలు అస్తవ్యస్తంగా మారాయి. అంతేగాక బస్టాండ్ సెంటర్, కార్గిల్ సెంటర్ మధ్యలో గత వారం రోజుల నుంచి సెంట్రల్ లైటింగ్ వెలగటం లేదని పట్టణవాసులు మండి పడుతున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ మధ్యలో జాతీయ రహదారి రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండడంతో, రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలుగక పాదచారులుతో పాటు వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో మునిసిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. పట్టణ కేంద్రంలోనే సెంటర్ లైటింగ్ వ్యవస్థ ఇలా ఉంటే వివిధ వార్డుల్లో ఉన్న తండా వార్డులు, అవాస ప్రాంతాల వీధిలైట్లు పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలసిందేనని పట్టణ వాసులు గుస గుస లాడుతున్నారు. మునిసిపల్ పాలకవర్గం సభ్యులు గానీ, సంబంధించిన అధికారులు గాని పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. స్థానికులకు సౌకర్యాలు కల్పించడంలో పాలక, అధికార వర్గం విఫలమైందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ సిస్టంను పునరుద్ధరించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని పట్టణ ప్రజలు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

## వెంటనే రిపేర్ చేయాలి..

**– దుండి వీరన్న, సీపీఐ(ఎం)మండల కార్యదర్శి**



మరిపెడ పట్టణంలో గత కొంతకాలంగా సెంట్రల్ లైటింగ్ లేక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) మరిపెడ మండలం కార్యదర్శి దుండి వీరన్న ఆరోపించారు. మరిపెడ పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన సెంటర్ లైటింగ్ కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లైటింగ్ కోసం లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్న మునిసిపాలిటీ అధికారులు ప్రజలకు వీధిలైట్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంటర్ లైటింగ్ తోపాటు ఆవాస ప్రాంతాల్లోని వీధిలైట్లను మరమ్మతు చేపట్టాలని ఆయన కోరారు.

# చెస్ ఆడుదాం.. చురుకుగా ఉందాం

**మంత్రి కొండా సురేఖ**




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** చెస్ క్రీడ చురుకుదనాన్ని పెంచడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగడాన్ని అలవర్చుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ రోజు హైదరాబాద్ రాయదుర్గంలోని మై హోమ్ అబ్రా అపార్ట్ మెంట్స్ లో నిర్వహించిన లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈవెంట్ కు మంత్రి సురేఖ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 10 నిమిషాల్లో 100 కు పైగా చెక్ మేట్లతో పజిల్స్ ను పరిష్కరించిన ఐదేళ్ళ చెస్ క్రీడాకారిణి ఇషాని చక్కిలం ప్రతిభకు మంత్రి ముగ్ధులయ్యారు. రాయ్ చెస్ అకాడమీలో శిక్షణ పొందిన ఇషాని అత్యంత చిన్న వయసులో అరుదైన పజిల్ ను పరిష్కరించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా రాయ్ చెస్ అకాడమీ సర్టిఫికెట్ ను ప్రదానం చేశారు. పాప తల్లిదండ్రులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రిటిష్ డిప్యూటీ హై-కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, పలువురు చెస్ క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అనఘాష్టమి వ్రతాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ములుగు రోడ్డులోని గల శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో వైశాఖమాసం బహుళ అష్టమిని పురస్కరించుకొని శుక్రవారం అంగరంగ వైభవంగా శ్రీ అనఘాష్టమి వ్రతాలను నిర్వహించారు. అవధూత దత్త పీఠాధిపతి, పరమ పూజ్య, జగద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో దత్త పీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ అనుగ్రహంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ జీఎస్ దత్త జ్ఞానబోధ సభ వరంగల్ ట్రస్ట్ నిర్వహించింది. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహించి ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం వాటర్ కూలర్స్ ను అందుబాటులో ఉంచారు.

# విత్తనాల కొరత లేదు

**కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు**

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్**

**జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**

**విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో ఎలాంటి విత్తనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో విత్తనాల లభ్యత, వానాకాలం సాగుపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల ప్రకారం రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలో ప్రవేశించనున్నందున రైతులు సాగుకు సమాయత్తం కావాలన్నారు. జిల్లాలో వచ్చే వానాకాలం ఈ సంవత్సరం 1.05 లక్షల ఎకరాల్లో వరి, 1.28 లక్షల ఎకరాలలో పత్తి, 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 15 వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. ఎవరైనా విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, పత్తి విత్తనాలు లభించకపోయినా, ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ ధరకు అమ్మినా నేరుగా కంట్రోల్ రూమ్ మొబైల్ నంబర్ 7288894714 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

### విత్తన దుకాణాల్లో తనిఖీలు..

వరంగల్ నగరంలోని దేవి సీడ్స్, గణపతి పున్నమి, సీతారామ తదితర విత్తన విక్రయ దుకాణాలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్, విత్తనాల ప్యాకెట్లు, నిల్వ స్టాకును ఆమె పరిశీలించారు. స్టాకు వివరాలను నోటీస్ బోర్డుపై పెట్టాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మకూడదని, మార్కెట్ లో అధిక డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాల్, ఏడీఏ సురేష్, ఏఓలు విజ్ఞాన్, సారంగం స్థానిక తహశీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ :

**సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య**

నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పిప్రావిణ్య, సీపీతో కలిసి జిల్లాలోని విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. అనుమతి లేని విత్తనాలు మార్కెట్ లోకి రాకుండా నివారించేందుకు వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్సు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీలు అబ్దుల్ బారి, రవీందర్, ఏసీపీలు తిరుపతి, కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాల్, ఏడీఏ సురేష్ కుమార్, వ్యవసాయ అధికారులు, జిల్లా విత్తన డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు, జిల్లా విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



# వివిధ కారణాలతో పిల్లల ఆత్మహత్య

**వరంగల్ జిల్లాలో రెండు విషాద ఘటనలు**

**వరంగల్ వాయిస్, క్రైం :** ఎండలో ఆడుకోవద్దన్నందుకు ఒకరు.. నచ్చని హెయిర్ కటింగ్ చేయించారని మరొక బాలుడు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ హృదయవిదాకర సంఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకుంది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లికి చెందిన తొమ్మిది సంవత్సరాల బాలుడు మూడో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఎండలో ఎక్కువగా తిరుగుతూ ఆడుకుంటున్నాడు. దీనిని గమనించిన తల్లి ఎండలో తిరగవద్దంటూ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో సంఘటనలో మహబూబాబాద్ జిల్లా గంగారాం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన తొమ్మిది సంవత్సరాల బాలుడు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. వేసవి సెలవులకు ఇంటివద్దకు వచ్చాడు. కాగా, తండ్రి ఇష్టం లేని హెయిర్ కటింగ్ చేయించాడని హర్షవర్ధన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లల మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com